క్లుప్తంగా

తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం



గురజాల : తక్కువ ఖర్చుతో మంచి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవచ్చని ఇన్‌చార్జి సీడీపీవో వై.రత్నకుమారి బాలింతలు, గర్భిణులకు సూచించారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలనీ నందు గల అంగన్‌వాడీ కేంద్రం నందు మంగళవారం వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు మంచి పోషకాలు కలిగిన ఆహారం తీసుకుని రక్తహీనతకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం జంగమహేశ్వరపురం నందు మోగా ప్రాముఖ్యత, యోగా చేయడం వలన కలుగు ప్రయోజనాలు గురించి వివరించారు. అనతరం చిన్నారులను అంగన్ వాడీ కేంద్రాలకు పంపించాలని అవగాహన కల్పించారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి




దాచేపల్లి : రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతులు వివరాలు నమోదు చేసుకోవాలని ఏవో డి. పాపకుమారి తెలిపారు. మండలంలోని పెదగార్లపాడులో ఈ సంఖ్యపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలను పారదర్శకంగా, సులభతరం చేయడం కోసం వెబ్‌ల్యాండ్ పోలం కలిగి ఉన్న రైతులకు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యని కేటాయిస్తున్నామని చెప్పారు. పీఎం కిసాన్, పంట రుణాలపై వడ్డీ రాయితీ, క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, యంత్రాలపై రాయితీలను పొందవచ్చునని చెప్పారు. రైతు సేవా కేంద్రాలకు రైతులు వెళ్లి ఈ సంఖ్య కోసం వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రకృతి పాఠం



కారెంపూడి: విద్యార్థులు తమ పాఠశాల పరిసరాల్లో మొక్కలు నాటి, ఆదర్శవంతంగా నిలవాలని పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆయన ప్రకృతి పాఠం బోధించారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ ఆయన రూపొందిన కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. జాజికి అక్కడ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సాదర స్వాగతం పలికారు.

అధిక లోడుతో ప్రమాదం



పిడుగురాళ్ల: ప్రమాద భరితంగా ట్రాక్టర్లు, టిప్పర్లతో సున్నపు రాయిని తీసుకెళ్తున్నారు. ఇప్పటికే పలుమార్లు రహదారిలో లేదా వెనుక వచ్చే వాహనాల మీద పడడం, చిన్నపాటి గాయాలు కావడం జరిగినా ఎవరు పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడుతో వెళ్లే వాహనాలను తనిఖీ నిర్వహించి, ప్రమాదల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కసువు ఘర్షణ.. కేసు నమోదు

పెదకూరపాడు : ఇంటి వెలుపుల కసువు పోగు చూసే క్రమంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణకు దారి తీసింది. పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గారపాడు గ్రామానికి చెందిన గోలి కొండలరావు, కొండమీద పూర్ణయ్య కుటుంబాల మధ్య కసువు పోసుకునే విషయమై ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో గాయపడిన కొండమీద పూర్ణయ్య ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించి కొండలరావు, గోపి, మహాలక్ష్మి, తిరుపతమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

రైతుల వేదన వినపడదా?

- పంట పొలాల్లో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
- మోటారు పగలగొట్టి రాగి తీగ ఎత్తుకెళ్తున్న దుండగులు
- ఆరుగాలం కష్టించే రైతుకు అదనపు కష్టం
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- దొంగలను పట్టుకోవడంలో నిర్లక్ష్యం

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు అడుగడుగునా కష్టాలు వెంటాడుతుంటాయి. ఎండకు, వానకు కష్టించి పండించిన పంటను కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల బెడద వారిని ఆర్థికంగా, మానసికంగా కుంగదీస్తోంది. విద్యుత్ సరఫరా లేక ఎండిపోతున్న పంటలకు నీరు ఎలా పెట్టుకోవాలో అర్థం కాక కర్షకులు కన్నీరు పెడుతున్నారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో విచారం వ్యక్తం చేస్తున్నారు.



రాయవరం పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి రాగితీగ చోరీ

మాచర్ల రూరల్: వ్యవసాయ భూముల్లో సాగు నీటి కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగలను దొంగలు చోరీ చేస్తున్నారు. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి.. రాగి తీగలను అమ్ముకుంటున్న ఘటనలు మండల, పట్టణ శివారు పొలాల్లో ఇటీవల ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ శివారులోని పంట పొలాల రైతులు భవనం వెంకటరెడ్డి, ముక్కా సోమయ్య, ఇల్లూరి కేశవరెడ్డి, కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆరికట్ల కోటిరెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, రాయవరం గ్రామానికి చెందిన గోగుల లక్ష్మారెడ్డి, కంభంపాడు గ్రామానికి చెందిన కాకర్ల శ్రీరాములుకు చెందిన పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని వైర్లు కోసం వాటిని పూర్తిగా ధ్వంసం చేసి, రాగి వైరును చోరీ చేసి అమ్ముకున్నారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కనిపించటం లేదని వారు వాపోతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

వర్షాభావ పరిస్థితుల్లో ఎలాగోలా పంటను పండించుకొని వ్యవసాయాన్ని గట్టెక్కిస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరుగుతుండటంతో ఎండిపోతున్న పొలాలకు వేలాది రూపాయలు ఖర్చు చేసి నీటి సరఫరా చేసుకోవాల్సి వస్తుంది. అంతేకాకుండా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ. 70 నుంచి రూ. 80వేలు ఖర్చు చేయాలి. వీటి కోసం విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతూ దొడ్డిదారిన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకునే పరిస్థితి దాపురించింది. గ్రామాల్లో తరచూ జరుగుతున్న చోరీల వల్ల మిర్చి, కంది, మొక్క జొన్న పొగాకుతో పాటు తోటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చోరీల విషయంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పరిశీలించి ఫొటోలు తీసుకొని వెళ్లడం పరిపాటిగా మారటంతో చాలా మంది రైతులు ఫిర్యాదు చేయడం మానుకున్నట్లు చెబుతున్నారు. పంట నష్టాన్ని కాపాడుకునేందుకు అప్పు చేసి, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకొని నీటి సరఫరా జరుపుకుంటున్నట్లు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చోరీలు జరగకుండా నివారించడంలో పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు.

అప్పు చేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



నెల రోజుల క్రితం రాయవరం గ్రామంలోని నా పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను రాగి తీగ కోసం పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. ప్రయోజనం లేదు. దీంతో ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు అప్పు చేసి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నా.

– గోగుల లక్ష్మారెడ్డి, రైతు, రాయవరం

పట్టించుకునే వారు లేరు



పట్టణ శివారులోని నా ఐదు ఎకరాల పంట పొలంలో సొంత డబ్బులతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నా. నెల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేశారు. దీని పై పోలీసు స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాను. దొంగలను పట్టుకోవడంలో పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– అరికట్ల కోటిరెడ్డి, రైతు, కొత్తపల్లి

ఎలుకల నివారణ మందు పంపిణీ



మందు తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ బ్రహ్మారెడ్డి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

రెంటచింతల: రైతులందరూ సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం రెంటాల రైతు సేవా కేంద్రంలో సామూహిక ఎలుకల నివారణ చర్యలో భాగంగా విషపు ఎరువు తయారు చేసి, రైతులకు ఆయన పంపిణీ చేశారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల వద్ద ఈ మందును తయారు చేసి, రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఎలుకలు తినే దానికన్నా 7 నుంచి 8 రెట్లు ధాన్యాన్ని నష్టపరుస్తాయన్నారు. వరిపైరు 4 నుంచి 6 వారాల మధ్య ఎలుక రోజుకు 100 వరకు మొక్కలను కొరికి నాశనం చేస్తుందన్నారు. ఎలుకల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా బ్రోమోడయోలిన్ అనే మందును 100శాతం రాయితీపై అందచేస్తుందని చెప్పారు. రెండు గ్రాముల బ్రోమోడ యోలిన్ మందును, 96గ్రాముల నూకలు, రెండు గ్రాముల వంటనూనెను కలిపి 100గ్రాముల విషపు ఎరను తయారుచేసుకోవచ్చన్నారు. ఒక్కొక్క ఎలుక బొరియలో 10 గ్రాముల విషపు ఎరను పొట్లాలుకట్టి వేయాలన్నారు. వీఏఏలు పాల్గొన్నారు.

సమర్థంగా ఎలుకలను నివారించాలి

గురజాల రూరల్ : ఎలుకలను సమర్థంగా నివారించుకోవాలని ఏవో ఎం.సంధ్యారాణి రైతులకు సూచించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు, జంగమహేశ్వరపురం, పల్లెగుంత గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట పోలాల్లో ఎలుకలను నివారించేందుకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులైన సాగు యాంత్రిక జీవ నియంత్రణ తో పాటు రసాయన పద్ధతులు పాటించాలన్నారు. ఎలుకలు నిర్మూలనకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా వంద శాతం రాయితిపై బ్రోమో డయోలిన్ మందును అందించడం జరుగుతుందన్నారు. రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది సలహాలు తీసుకుని మంచి దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులున్నారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

మాచర్ల రూరల్: రైతులందరికీ సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కట్టా లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మందు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మందు ప్యాకెట్లు పెట్టే పద్ధతిని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సైదా నాయక్ వివరించారు. మిరప పైరు యాజమాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి సురేష్ ఎఈఓ వర్మ, పిహెచ్ఓలు కరుణా నాయక్, భాను పాల్గొన్నారు.

జూలకల్లులో..

పిడుగురాళ్లరూరల్: మండలలోని జూలకల్లు గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన మందు మంగళవారం పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారి ఎస్. శ్రీనివాసరెడ్డి మందు తయారీ చేసి, రైతులకు అందజేశారు. మందు వినియోగాన్ని వివరించారు. ఉద్యాన వన సహాయకులు షేక్ దస్తగిరి, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతతో కూడిన పని భవిష్యత్తుకు పునాది



కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దాచేపల్లి: భద్రతో కూడిన పని కార్మికుడి భవిష్యత్తుకు పునాది అని ప్లాంట్ హెడ్ సుబ్బారావు అన్నారు. గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో 54 జాతీయ భద్రత వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. కార్మికులతో కలిసి అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ప్లాంట్ హెడ్ సుబ్బారావు మాట్లాడుతూ.. భద్రత విషయంలో కార్మికులు మెలకువగా ఉండాలని, భద్రతలేని పనులు చేసి ప్రమాదాలబారిన పడవద్దని సూచించారు. ఫ్యాక్టరీ అభివృద్ధితో పాటుగా కార్మికుడి భద్రత కూడా యజమాన్యానికి ముఖ్యమని చెప్పారు. 2024–25లో జీరో ప్రమాదాలతో ఉత్పత్తి జరిగిందని, ఈ ఏడాది కూడా ప్రమాదాల జరగకుండా నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. సేఫ్టీ మేనేజర్ సంజయ్ సింగ్, అధికారులు నరేందర్‌రెడ్డి, నాగభూషణం, అంబేడ్కర్ రెడ్డి, వీరప్రకాష్, రామకృష్ణా, గణేష్, నరసింహులు, వేణు, తారక్, అవినాష్ పాల్గొన్నారు.

నేడు భద్రతా వారోత్సవాలు ప్రారంభం

సత్రశాల(రెంటచింతల): స్థానిక పరాశక్తి సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆవరణలో బుధవారం నుంచి 54 వ జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అధికారులు, కార్మికులతో కలిసి భద్రతా జండాను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందన్నారు. భద్రతా ప్రదర్శనలతో అవగాహన పెంపొందించడానికి బుధవారం నుంచి 11వ తేదీ వరకు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.రాంబాబు, నర్సరావుపేట కర్మాగారపు తనిఖీ అధికారులు వారోత్సవాలలో పాల్గొంటారన్నారు.

పవిత్ర హృదయంతో తపస్సుకాల దీక్ష

రెంటచింతల: తపస్సుకాల దీక్ష తీసుకున్న మాలదారులు ఏసుక్రీస్తును నిండు హృదయంతో ప్రార్థించాలని స్థానిక కానుక మాత చర్చి విచారణ గురువు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి అన్నారు. మంగళవారం చర్చి ఆవరణలో ఆయన మాట్లాడారు. ఏసు క్రీస్తు అంతిమ గడియలలో శిలువ వేయబడి, పడిన కష్టాలను క్రైస్తవులు స్మరించుకోవాలన్నారు. 40 రోజుల పాటు ఉపవాస దీక్షను తీసుకుని నిండు హృదయంతో ప్రార్థన, దాన ధర్మాలు చేయాలన్నారు. దీక్ష తీసుకున్న వారు క్రీస్తు సూక్తులను ఆచరిస్తూ సన్మార్గంలో నడవాలని సూచించారు. మాలదారులు బుధవారం నుంచి వరకు 40 రోజుల పాటు ఈ తపస్సుకాల ప్రార్థనల్లో భాగంగా ప్రతి బుధ, శుక్రవారం సాయంత్రం నిర్వహిస్తున్న ఏసుక్రీస్తు శిలువ ధ్యానం గుర్తుచేస్తు 14 స్థలాల పాట్లను స్మరించుకుంటు ప్రార్థనలో పాల్గొనాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో పాల్గొన్న అంగన్‌వాడి కార్యకర్తలు

పిడుగురాళ్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం యోగా, న్యూట్రిషియన్ స్టాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం లింగాల ధనలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉన్నం భారతి, ఆయుష్ శాఖ వైద్యురాలు మేఘమాల హాజరయ్యారు. మహిళలు పని ఒత్తిడికి దూరంగా ఉండాలంటే యోగా, మెడిటేషన్ తప్పనిసరిగా చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్టమూరులో ఇరు కుటుంబాల మధ్య దాడులు

సత్తెనపల్లి: పాత కక్షల నేపథ్యంలో సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇరు కుటుంబాల మధ్య సోమవారం రాత్రి పరస్పర దాడులు జరిగాయి. దాడుల్లో నలుగురికి గాయాలయ్యాయి. తేళ్లూరి దేవకుమార్, తేళ్లూరి సుందరరావు, కందుకూరి సాయి, కందుకూరి పుల్లమ్మలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరిలో ఇరువురి పరిస్థితి విషమించటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట రైతు సేవ కేంద్రంలో మంగళవారం మండల స్థాయి వ్యవసాయ శాఖ దాని అనుబంధ శాఖల అధికారులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు వ్యవసాయ ఉప సంయుక్త సంచాలకులు హనుమంతురావు మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంటకు ముందు ప్రతి ఒక్క రైతు తన పొలంలో పీఎండీఎస్ (నవధాన్య విత్తనాలు) చల్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా చీడపీడల నివారణ జరుగుతుందని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి మాట్లాడుతూ ప్రతి రైతు వారికున్న భూమిలో నవధాన్య విధానం ఆచరించడం వలన భూమిలో వివిధ సూక్ష్మజీవులు వృద్ధి చెంది భూమికి కార్బన్ శాతం చేరడంతో పాటు పశువులకు మేతగా కూడా ఉపయోగపడుతుందన్నారు. జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ రాజు మాట్లాడుతూ ప్రతి యానిమేటర్ తన పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి అహ్మద్ మాట్లాడుతూ ప్రతి రైతు అంతర పంటల విధానం ఆచరించాలని దీని వలన చీడపీడల ఉధృతి తగ్గి భూమి సారవంతమవుతుందని, అంతే కాకుండా ప్రతి రైతు సొంత విత్తనాన్ని వినియోగించాలని సూచించారు. వేసవికాలంలో కూడా విత్తనాలు మొలకెత్తడానికి వీలుగా విత్తన గుళికల విధానం ఎలా చేయాలో డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి శ్రీనిత్య, సెర్ప్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సుఖ ప్రసవంపై అవగాహన పెంచాలి



కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

ముప్పాళ్ల: గ్రామాల్లోని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు గర్భిణులకు సకాలంలో టీకాలు అందించి సుఖవంతమైన ప్రసవం జరిగేలా అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమం మంగళవారం జరిగింది. బాలికా విద్య, ఆహారం, సరైన వయసులో వివాహంపై అవగాహన కల్పించారు. వేసవి కాలంలో పిల్లలు, వృద్ధుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పమిడిపాడు వైద్యురాలు వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ ఉస్మాన్, ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.పీటర్‌డేమియన్, ఎం.జోస్పిన్‌రాణి, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోల్లో పరిమితికి మించి ఎక్కిస్తే కేసులు పెడతాం



క్రోసూరు: ఆటోల్లో పరిమితికి మించి కూలీలు, ప్రజల్ని ఎక్కిస్తే తప్పనిసరిగా కేసులు పెడతామని ఎస్ఐ నాగేంద్రరావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం క్రోసూరు ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో మితిమీరి కూలీలు ఎక్కి వెళ్లవద్దని తెలిపారు. అదే విధంగా సంబంధిత ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు తిప్పితే కేసులు పెడతామని హెచ్చరించారు. రోడ్లపై వాహనాదారులు, ప్రయాణికులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దన్నారు. తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రెంటచింతల గరిష్ట ఉష్ణోగ్రత 39.5 డిగ్రీలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రత 39.5 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 28.4 డిగ్రీలుగా నమోదైంది. ఎండలు మండుతుండటంతో వివిధ పనులకు వెళ్లే కూలీలతో పాటు వృద్ధులు, చిన్నారులు అల్లాడుతున్నారు. ఏటా వేసవిలో రాష్ట్రంలో నే అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యే ప్రాంతాల్లో ఒకటైన రెంటచింతలలో పెరుగుతున్న ఎండలకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో ఉదయం 10గంటల నుంచి బయటకు రావడానికి గ్రామస్తులు భయపడుతున్నారు.

వివేకానంద పరీక్ష కేంద్ర విద్యార్థులు.. ఆక్స్‌ఫర్డ్‌లో పరీక్షలు రాయాలి

దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడు వివేకానంద హైస్కూల్ పేరుతో హాల్ టిక్కెట్లు పొందిన 10వ తరగతి విద్యార్థులు దాచేపల్లిలోని ఆక్స్‌ఫర్డ్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాయాలని ఎంఈఓ పినాకపాని మంగళవారం ఓ ప్రకటలో తెలిపారు. వివేకానంద హైస్కూల్‌ని ఆక్స్‌ఫర్డ్‌గా పేరుమార్పు కోసం ప్రభుత్వారికి దరఖాస్తు చేసుకున్నారని, ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని ఆయన చెప్పారు. వివేకానంద హైస్కూల్ పేరు మీద హాల్ టిక్కెట్లు పొందిన విద్యార్థులు ఆందోళన చెందకుండా ఆక్స్‌ఫర్డ్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాయాలని, తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

చర్చి పాస్టర్‌కు ఆర్థిక సాయం

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల లూథరన్ చర్చి పాస్టర్‌కు గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య మంగళవారం ఆర్థిక సాయం చేశారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచనల మేరకు కిడ్నీ సంబంధిత వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలు, చర్చి అభివృద్ధికి మరో రూ.50 వేల మొత్తాన్ని ఆయన సంఘ పెద్దలకు అందించారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు

పిడుగురాళ్ల: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఇంగ్లీష్ సబ్జెక్టుపై పరీక్షలు నిర్వహించారు. పిడుగురాళ్ల పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 271 మంది విద్యార్థులకు గాను 15, ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో 605 మంది విద్యార్థులకు గాను 14, స్కాలర్ స్కూల్‌ల్లో 298 మంది విద్యార్థులకు గాను 9, నారాయణ జూనియర్ కళాశాలలో 387 మందికి గాను ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

12 మంది విద్యార్థుల గైర్హాజరు

దాచేపల్లి: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ ప్రథమ పరీక్షకు మంగళవారం 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వరావు తెలిపారు. 501 మంది విద్యార్థులకు 489 మంది హజరయ్యారని ఆయన వెల్లడించారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్ష కేంద్రంలో తనిఖీలు చేపట్టారు.

100 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, సుమారు 100 మందికి ఉచిత వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వి. దేవేంద్రనాథ్ సమక్షంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ లలిత కుమారితోపాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు సేఫ్టీ చర్యలపై సర్వే

క్రోసూరు: క్రోసూరులో పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, క్రోసూరు పోలీసు శాఖ సంయుక్తంగా రోడ్ సేఫ్టీకి చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం సర్వే చేసినట్లు క్రోసూరు ఎస్ఐ నాగేంద్రరావు మంగళవారం తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కడ చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి, ఎక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టాలి, ఎక్కడ మలుపులున్నాయి, ఎక్కడ స్పీడ్ బ్రేకర్లు ఇవ్వాలి, హై లెవల్ బ్రిడ్జిలు, లో బ్రిడ్జిలు వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టేందుకు సర్వే చేసినట్లు తెలిపారు. అమరావతి మీదగా క్రోసూరు, క్రోసూరు నుంచి సత్తెనపల్లి వరకు పరిశీలించినట్లు ఎస్ఐ తెలియజేశారు. దీనిపై త్వరలో తగు విధంగా హెచ్చరిక బోర్డులు పెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

